క్లుప్తంగా

కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల పట్టణంలోని 11, 22వ వార్డులలో పద్మశాలీలీ, ఏకలవ్యనగర్ కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఇందులో భాగంగా 11వ వార్డులో రూ.15 లక్షలతో పద్మశాలీ కమ్యూనిటీ భవనం, 22వ వార్డులో రూ.20 లక్షలతో ఏకలవ్య కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు రాజేశం, కల్లూరి లత పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు



జెండా ఎగురవేస్తున్న నాయకులు

సిరిసిల్లఎడ్యుకేషన్/వేములవాడరూరల్: వేములవాడ మండల విద్యావనరుల కేంద్రం సిరిసిల్ల శివనగర్ పాఠశాలలో టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి పూరెల్లి రవీందర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దోర్నాల భూపాల్‌రెడ్డి, రామ్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యమాలే ఊపిరిగా విద్యార్థుల శ్రేయస్సే ముఖ్య లక్ష్యంగా ఆవిర్భవించిన ఈ సంఘం హక్కుల కోసం ముందుకు వెళ్తుందన్నారు. టీపీటీఎఫ్ ఉపాధ్యక్షులు పురం వాసుదేవరావు, మల్లారపు పురుషోత్తం, సత్తు రవీందర్, జిల్లా కార్యదర్శులు సూర్య భాస్కర్, తాళ్లపల్లి శ్రీధర్, ఆకునూరి చంద్ర శేఖర్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బూస రాజేందర్, మైలారం తిరుపతి, నుగురి దేవేందర్, ఎం. లక్ష్మీనారాయణ, బండి ఉపేందర్, డి మధుసూదన్ పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం



ముస్తాబాద్‌లో మూసివున్న దుకాణాలు

ముస్తాబాద్: మేజర్ పంచాయతీలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ, కాంగ్రెస్ తలపెట్టిన ముస్తాబాద్ బంద్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. సర్పంచ్ భర్త నిర్మిస్తున్న కట్టడంపై చర్యలు తీసుకోవాలని కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సింగిల్‌విండో మాజీ చైర్మన్ కనమేని చక్రధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తిరుపతి మాట్లాడుతూ సర్పంచ్ భర్త అక్రమంగా భవనాన్ని నిర్మిస్తున్నారని, ఆందోళనలు చేపట్టినా అధికారులు స్పందించడం లేదన్నారు. కలెక్టర్, డీపీవోకు సైతం ఫిర్యాదు చేసినా, పంచాయతీ, మండల పరిషత్ అధికారులు తప్పుడు నివేదికలు ఇస్తూ జిల్లా అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఎంపీటీసీ శ్రీనివాస్, బీజేపీ, కాంగ్రెస్ పట్టణాధ్యక్షులు మహేందర్, రాజు, బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ధర్మేందర్, డీసీసీ ఉపాధ్యక్షుడు బుర్ర రాములు పాల్గొన్నారు. ఎస్సై వెంకటేశ్వర్లు బందోబస్తు చేపట్టారు.

ప్రసిద్ధిచెందిన ఆలయం అభివృద్ధికి దూరం..

ఇల్లంతకుంట: కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం తల్లి గండ్లె పోచమ్మ ఆలయం నిరాధరణకు గురై అభివృద్ధికి ఆమడదూరంలో ఉంటుంది. నిత్యం అమ్మవారి సన్నిధికి వందలాది సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అయినప్పటికీ ప్రభుత్వం ఈ ఆలయాన్ని ఎండోమెంట్ పరిధిలోకి తీసుకుని అభివృద్ధి మాత్రం చేయడం లేదనే విమర్శలున్నాయి. ఇల్లంతకుంట మండలంలోని ఓబులాపూర్ శివారులోని గండ్లె గుట్టల్లో పోచమ్మ తల్లి కొలువుదీరింది. సిరిసిల్ల జిల్లా కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో అమ్మవారి ఆలయం ఉంది. పచ్చటి చెట్లతో అలరారుతున్న గుట్టల మధ్యలో ప్రకృతి సింగారించుకున్నట్లు ఉన్న ఈ ప్రాంతంలో అమ్మవారు కొలువై ఉంది. ఈ ఆలయానికి ఇల్లంతకుంట మండలంతో పాటు, సిరిసిల్ల, బోయినిపల్లి, వేములవాడ, ముస్తాబాద్, సిద్దిపేట, కరీంనగర్ తదితర ప్రాంతాల నుంచి ప్రతిరోజూ భక్తులు వస్తుంటారు. ఆదివారం, బుధవారం మాత్రం భక్తుల సంఖ్యలో వెయ్యికి పైగానే ఉంటుంది. భక్తులు సంఖ్య పెరుతుందే కాని అమ్మవారి ఆలయం మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదని భక్తులంటున్నారు. ప్రభుత్వం దృష్టి సారించి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని భక్తులు, ప్రజలు కోరుతున్నారు.

- ఇబ్బందుల్లో గండ్లె పోచమ్మ భక్తులు
- ఆలయ అభివృద్ధిపై శ్రద్ధలేని అధికారులు
- మంత్రి కేటీఆర్ దృష్టి సారిస్తేనే అభివృద్ధి



పోచమ్మ ఆలయం వద్దకు వచ్చే మెట్ల పరిస్థితి



పోచమ్మ ఆలయం

మంత్రి దృష్టి సారిస్తే అభివృద్ధి..

మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రాతినిధ్యం వహిస్తున్న చీర్లవంచ, ఓబులాపూర్ గ్రామాల సరిహద్దుల్లో ఈ ఆలయం ఉంది. నెల రోజుల క్రితం మంత్రి కేటీఆర్ చీర్లవంచ గ్రామానికి వెళ్లినప్పుడు స్థానిక నాయకులు కనీసం పోచమ్మ ఆలయం దగ్గర ఉన్న పరిస్థితి వివరించలేదని, మండల నాయకులు కూడా ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ దృష్టికి తీసుకెళ్లడం లేదనే విమర్శలొస్తున్నాయి. మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే రసమయి స్పందించి గండ్లె పోచమ్మ దగ్గర అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు చేసి భక్తుల సమస్యలు తీర్చాలని కోరుతున్నారు.

పర్యాటక ప్రాంతం చేయాలి

ఈ ఆలయం మధ్య మానేరు ప్రాజెక్టుకు సమీపంలోనే ఉంది. కాని పోచమ్మ ఆలయాన్ని మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రతిరోజూ అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తూనే ఉంటారు. అమ్మవారికి బోనం మొక్కుతో పాటు ఇతర మొక్కులన్నీ తీర్చుకుంటారు. అమ్మవారికి మొక్కుకుంటే ఖచ్చితంగా కోరిన కోర్కెలు తీరుతాయనేది ఇక్కడి భక్తుల నమ్మకం. గండ్లె పోచమ్మ ఆలయం వద్ద హైమాస్ట్ లైట్లు, నీటి ట్యాంకులు, ఆలయం దగ్గరకు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణం, బస్సు సదుపాయం, భక్తులు సేదతీరేందుకు ధర్మశాలల నిర్మాణంతో పాటు ఇతర పనులన్నీ ప్రభుత్వం చేయించాలని భక్తులు కోరుతున్నారు.

మంత్రి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం



ఆలయ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ దృష్టికి తీసుకెళ్తాం. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ గెలిచాకనే పోచమ్మ ఆలయానికి విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేయడం జరిగింది. అధికారులతో కలిసి పరిశీలన చేసి పోచమ్మ ఆలయం వద్ద చేయాల్సిన అభివృద్ధి పనుల కోసం నివేదిక ప్రభుత్వానికి పంపిస్తాం.

– సిద్దం వేణు, జెడ్పీ వైస్‌చైర్మన్

ఆలయాన్ని అభివృద్ధి చేయాలి



గండ్లె పోచమ్మ ఆలయాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేయాలి. ఆలయం వద్ద సరైన సదుపాయాలు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే రసమయి స్పందించి పోచమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి. పోచమ్మ ఆలయం వరకు రోజు బస్సు సదుపాయం కల్పించాలి.

– మధు, రహీంఖాన్‌పేట

ఇళ్ల పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

- ఆర్డీవో పవన్‌కుమార్

కోనరావుపేట: మండలంలోని కనగర్తి, మర్తనపేట గ్రామాల్లోని నిరుపేదలు ఇళ్ల పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో పవన్‌కుమార్ కోరారు. కోనరావుపేట తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం సందర్శించారు. కార్యాలయంలోని వివిధ రకాల ఫైళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణ పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తుందన్నారు. ఇళ్లు నిర్మించుకునే వ్యక్తులకు ప్రభుత్వం తరపున రూ. 5 లక్షలు సాయం అందుతుందని, మిగతా డబ్బులు లబ్ధిదారుడు సొంతంగా భరించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం అందించే రూ.5 లక్షలలో జీఎస్టీ రూ.70 వేలు మినహాయించగా, రూ. 4.30 లక్షలు అందుతాయన్నారు. మొదటి విడతగా కనగర్తి, మర్తనపేట గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందని, అర్హులైన ఈ రెండు గ్రామాల ప్రజలు ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న ఆర్డీవో పవన్‌కుమార్

స్వగ్రామానికి వైకుంఠ రథం వితరణ

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ గ్రామ పంచాయతీ కార్యాలయానికి టీఎన్‌జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, సోదరుడు డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామ్ బోర్డు (డీసీఈబీ) కార్యదర్శి స్వదేశ్‌కుమార్‌తో కలిసి సోమవారం వైకుంఠ రథాన్ని వితరణగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ తండ్రి మారం మల్లయ్య జ్ఞాపకార్థం వైకుంఠరథం అందించినట్లు తెలిపారు. ఇక్కడ ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, సర్పంచ్‌జూలపల్లి స్వప్నాంజలి, ఉపసర్పంచ్ బండారి రాములు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, జూలపల్లి అంజన్ రావు, పంజాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ నాన్ గెజిటెడ్ కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై తొలిసారిగా మండలంలోని విలాసాగర్ పీహెచ్‌సీని సందర్శించిన మారం జగదీశ్వర్‌ను సోమవారం పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మెడికల్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ల్యాబ్ టెక్నీషియన్ అజీజ్, పారా మెడికల్ సిబ్బంది, తదితరులున్నారు.



వైకుంఠరథాన్ని అందిస్తున్న జగదీశ్వర్, స్వదేశ్

క్రీడలతో స్నేహబంధం పెరుగుతుంది

వేములవాడరూరల్: క్రీడా పోటీలతో స్నేహబంధం పెరుగుతుందని వేములవాడ రూరల్ ఎంపీపీ బండ మల్లేశంయాదవ్ అన్నారు. మండలంలోని మర్రిపల్లి గ్రామంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమి, గెలుపును సమానంగా తీసుకోవాలని, పోటీల సమయంలో వ్యక్తిగత కక్షలు పెట్టుకోరాదన్నారు. గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీలు యువత ఉత్సాహంగా పాల్గొని రాష్ట్రస్థాయికి ఎదగాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సంగ స్వామి, నిర్వాహకులు సాగర్ల నరేశ్, సురేశ్, కిరణ్, వెంకటేశ్, శ్రీరాములు పాల్గొన్నారు.



పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ మల్లేశం

నవీన్‌కుమార్‌కు విశ్వకర్మ లెజెండరీ అవార్డు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్లకు చెందిన శ్రీరాముల నవీన్‌కుమార్ విశ్వకర్మ లెజెండరీ అవార్డు అందుకున్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించిన విశ్వకర్మల సమ్మిట్‌లో ఈ అవార్డు అందజేశారు. వ్యవసాయ పనిముట్ల తయారీలో నవీన్‌కుమార్ సృజనాత్మకతను గుర్తించి ఈ అవార్డు అందజేశారు. విశ్వకర్మ నాలెడ్జి సెంటర్ ఫౌండర్ విశ్వనాథుల పుష్పగిరి తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో సన్మానిస్తున్న నాయకులు

కెనాల్‌పై వేపచెట్ల నరికివేత

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం పోతుగల్‌లో మానేరు ప్రాజెక్టు కెనాల్‌పై ఉన్న వేప చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికి తీసుకెళ్లారని గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ముస్తాబాద్ నుంచి పోతుగల్ పంట పొలాల వరకు ఉన్న మానేరు కెనాల్‌పై ఉన్న నాలుగు వేప చెట్లను అక్రమంగా నరికివేశారన్నారు. ఒకవైపు హరితహారంలో మొక్కలు నాటుతుండగా, ప్రభుత్వ స్థలంలో ఉన్న పెద్ద వృక్షాలను గుట్టు చప్పుడు కాకుండా తీసుకెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో, నీటిపారుదలశాఖ అధికారులను కోరారు.



పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం మంగళవారం జరగనున్నట్లు రూరల్ ఏఈ రిషిక ఒక ప్రకటనలో తెలిపారు. మల్లారం 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనులు ఉన్నందున ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మల్లారం, చెక్కపల్లి, మర్రిపల్లి సబ్‌స్టేషన్లకు అంతరాయం కలుగనున్నట్లు తెలిపారు. వీటి పరిధిలో ఉన్న మల్లారం, హన్మాజీపేట, బొల్లారం, లింగంపల్లి, పోచెట్టిపల్లి, నాగాయపల్లి, మర్రిపల్లి, వెంకటాంపల్లి, అచ్చన్నపల్లి, బాలరాజుపల్లి, చెక్కపల్లి, ఎదురుగట్ల, నూకలమర్రి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆమె తెలిపారు.

సీసీ రోడ్డు కోసం ధర్నా



రోడ్డుపై నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి చంద్రంపేట 12వ వార్డు పోచమ్మ గుడి వీధిలో సీసీ రోడ్డు నిర్మించాలని కాలనీవాసులు సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ 20 నెలల క్రితం సీసీ రోడ్డు నిర్మిస్తామని చెప్పి రోడ్డుపై కంకర పోశారు. కానీ నేటి వరకు నిర్మాణం పూర్తికాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధికి, కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. కంకర రోడ్డులో నడవాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మా సమస్యను పట్టించుకునే నాధుడే లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీ రోడ్డు నిర్మాణం తొందరగా చేపట్టాలని లేకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

యువత సన్మార్గంలో నడవాలి



మాట్లాడుతున్న సీఐ అనిల్‌కుమార్

సిరిసిల్లఅర్బన్: యువత చెడుమార్గం వీడి సన్మార్గంలో నడవాలని సిరిసిల్ల టౌన్ సీఐ అనిల్‌కుమార్ కోరారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరులో సోమవారం మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్‌నేరాలు, డయల్ 100, సీసీ కెమెరాల ఏర్పాటు, మత్తు నిర్మూలన తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ వ్యవసనాలకు బానిస కావద్దన్నారు. ఎస్సై శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రేషన్ దుకాణంలో పోర్టిఫైడ్ రైస్

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రేషన్ దుకాణాలకు పోర్టిఫైడ్ బియ్యాన్ని ప్రభుత్వం అందజేస్తుందని తహసీల్దార్ జయంతికుమార్ తెలిపారు. పోర్టిఫైడ్ రైస్‌లో విటమిన్ బీ12, విటమిన్ కే, ఐరన్, పోలిక్ యాసిడ్ మూలకాలు ఉంటాయన్నారు. రక్తహీనత, పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు ఈ బియ్యం అందజేస్తున్నట్లు వివరించారు.

బీసీబంధు ప్రకటించాలి

సిరిసిల్లఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బీసీ బంధు పథకాన్ని ప్రవేశపెట్టాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కులాల వారీగా కుల వృత్తులు చేసుకునే వారికి రూ.లక్ష ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంపై నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో బీసీలు గుర్తుకువస్తున్నారని, రాష్ట్రం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా బీసీలకు న్యాయం జరగడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే బీసీబంధు కింద రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు ఇల్లందుల ప్రకాశ్, నరేశ్, అనిల్, నీరజ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు సీపీఎం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో కొంత మంది అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. అక్రమ నిర్మాణాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్నారు. ఇట్టి విషయంపై కలెక్టర్ ఫిర్యాదు చేసినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు కోడం రమణ, రాజశేఖర్, రమేశ్‌చంద్ర పాల్గొన్నారు.

వీవోఏల ముందస్తు అరెస్టు.. విడుదల

బోయినపల్లి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చలో హైదరాబాద్ వెళ్తున్న బోయినపల్లి మండల వీవోఏలను సోమవారం స్థానిక పోలీసులు అరెస్టు చేసి అనంతరం విడుదల చేశారు. మండలానికి చెందిన సుమారు 20 మంది వీఓఏలు కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నాలో పాల్గొనేందుకు రెండు వాహనాల్లో వెళ్లేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.



పోలీసుల అదుపులో బోయినపల్లి వీవోఏలు

ఎన్ని రోజులీ నిరీక్షణ.?

వేములవాడరూరల్: రైతన్న ఎన్నడూ లేని కష్టాలు ఈ సంవత్సరం ఎదుర్కొంటున్నాడు. యాసంగిలో దుక్కి దున్నినప్పటి నుంచి గింజ విక్రయించే వరకు ఏదో ఒక రూపంలో ఇబ్బంది పడుతునే ఉన్నారు. 20 రోజులుగా కల్లాల వద్ద ధాన్యం పోసిన రైతన్న వర్షాలు రావడంతో రాత్రి, పగలు ఆరబెట్టి మ్యాచర్ వచ్చిన తరువాత తూకం పెట్టారు. తూకం పెట్టి రోజులు గడుస్తున్నా కేంద్రాల నుంచి ధాన్యాన్ని తరలించకపోవడంతో ధాన్యం కుప్పలపైన వృద్ధులు కాపలా ఉండే పరిస్థితి ఏర్పడింది. లారీలు రాక రోజుల తరబడి ధాన్యం కుప్పల వద్ద నిరీక్షిస్తున్నారు. వేములవాడ మండలంలో 15 ధాన్యం కేంద్రాలను ప్రారంభించగా ఇప్పటికీ దాదాపు ఒక లక్ష 40 వేల క్వింటాళ్లు మాత్రమే తరలించారు. ఇంకా 2 లక్షల క్వింటాళ్ల వరకు కొనుగోలు కేంద్రాల వద్దనే ధాన్యం పేరుకుపోయింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి వెంట వెంటనే ధాన్యం తరలించాలని రైతులు కోరుతున్నారు.



ధాన్యం కుప్పలపై కాపలాగా ఉన్న వృద్ధ రైతులు

ఈ పంచాయతీ ఆపరేటర్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా శేషాద్రి



తంగళ్లపల్లి: మండలంలోని రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన గడ్డం శేషాద్రి తెలంగాణ ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని శ్రీకృష్ణ దేవరాయ భాష నిలయంలో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో శేషాద్రిని మరోసారి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. శేషాద్రి మాట్లాడుతూ కంప్యూటర్ ఆపరేటర్లకు కనీస వేతనం రూ.22750 చెల్లించాలని కోరారు.

జనహితకు అధికారుల డుమ్మా



బోయినపల్లి ప్రజావాణిలో తహసీల్దార్ నరేశ్

బోయినపల్లి: ప్రజల సమస్యలు ఎక్కడికక్కడే పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో కలెక్టర్ ఏర్పాటు చేసిన జనహిత కార్యక్రమానికి పలు శాఖల అధికారులు డుమ్మా కొడుతున్నారు. బోయినపల్లిలో సోమవారం నిర్వహించిన జనహితలో తహసీల్దార్ నరేశ్‌తో పాటు, ఐదు శాఖల ఉద్యోగులు మాత్రమే హాజరయ్యారు. వ్యవసాయ శాఖ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఎంపీడీవో కార్యాలయ టైపిస్టు, ఐకేపీ, ఎమ్మార్సీ సిబ్బంది హాజరయ్యారు. ప్రధానంగా అటవీశాఖ, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఇంజినీరింగ్, ఆరోగ్య శాఖల నుంచి ఎవరూ హాజరు కాలేదు. ప్రధాన శాఖల ఉద్యోగులు హాజరయ్యేలా చూస్తే లక్ష్యం నెరవేరుతుందని పలువురు పేర్కొంటున్నారు. అయితే సోమవారం నిర్వహించిన జనహితకు మాత్రం ఎలాంటి దరఖాస్తులు రాలేదని తహసీల్దార్ తెలిపారు.

వీర్నపల్లిలో రెండు దరఖాస్తులు

వీర్నపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జనహిత కార్యక్రమానికి రెండు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలన్నారు. లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉపాధిహామీ పనుల పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని ముస్కాన్‌పేట, కేశన్నపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను,నర్సరీలను ఏపీవో చంద్రయ్య పరిశీలించారు.

పుస్తెమెట్టెల వితరణ

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని కేసీఆర్ కాలనీకి చెందిన నిరుపేద శివరాత్రి లక్ష్మి–రాజుల కూతురు లావణ్య వివాహానికి సామాజిక కార్యకర్త, మాజీ సర్పంచ్ మమత పుస్తెమెట్టెలు అందజేశారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని తంగళ్లపల్లి, మండెపల్లి గ్రామాల్లో సోమవారం లబ్ధిదారులకు ఎంపీపీ పడిగెల మానస కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు.

నిరుపేద యువతి వివాహానికి ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన శివరాత్రి లక్ష్మి–రాజు దంపతుల కూతురు శీరిష వివాహానికి సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి సోమవారం రూ.10,116 అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చందుర్తి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై జిల్లెల రమేశ్ తెలిపారు. చందుర్తి శివారులోని రిజర్వాయర్ ప్రాంతంలోని ఒర్రె నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ట్రాక్టర్‌ను సీజ్ చేసి, డ్రైవర్ సతీశ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

ముస్తాబాద్: మండలంలోని తుర్కపల్లిలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డికి గ్రామస్తులు సోమవారం వినతిపత్రం అందజేశారు. లూజ్ వైర్లతో ఇబ్బందులు పడుతున్నామని, ఇనుప స్తంభాల స్థానంలో సిమెంట్ పోల్స్ వేయాలని సర్పంచ్ పద్మ కోరారు.

న్యాయవాదిపై కేసు నమోదు

తంగళ్లపల్లి: సిరిసిల్ల పట్టణానికి చెందిన ఓ న్యాయవాదిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయినట్లు ఫిర్యాదుదారు చొక్కాల తిరుపతి తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ తిరుపతికి వేములవాడ మండలం నాంపెల్లిలో ఉన్న 26 గుంటల భూమిని సిరిసిలకు చెందిన న్యాయవాది భార్య పేరిట కొనుగోలు చేశారని రిజిస్ట్రేషన్ చేసుకుని పూర్తిస్థాయిలో నగదు చెల్లించలేదని ఆరోపించారు. దీంతో తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఈ నెల 25న కేసు నమోదు అయినట్లు తెలిపారు. కేసు నమోదు అయినట్లు ఎస్సై లక్ష్మారెడ్డి ధ్రువీకరించారు.